# కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే..


అర్బన్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బిగాల


నల్లవెల్లిలో బాజిరెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న కవిత

- ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే
- సోషల్ మీడియాలో వచ్చే అబద్ధాలను యువత నమ్మొద్దు
- అప్పుడు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లున్నది ఆలోచించుకోవాలి
- బిగాల, బాజిరెడ్డిని మూడోసారి గెలిపించుకోవాలి
- అర్బన్, రూరల్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి, నవంబర్ 24 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. శుక్రవారం ఆమె జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాతో కలిసి రోడ్‌షోలో, డిచ్‌పల్లి మండలం యానంపల్లి, ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి, స్టేషన్ తండా, సిర్నాపల్లి గ్రామాల్లో రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో రకరకాల అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, యువత వాటిని నమ్మవద్దని సూచించారు. దేశంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని, అవసరమైతే గూగుల్‌లో కొట్టి చూసుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి అందులో 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. నోటిఫికేషన్ ఇవ్వగానే కాంగ్రెస్‌వారు కోర్టులో కేసులు వేస్తున్నారని తెలిపారు. దీంతో మిగతా ఉద్యోగాలు పెండింగ్‌లో పడ్డాయని ఆ విషయం మీ అందరికీ తెలిసిందేనన్నారు.


నగరంలోని ఓ హోటల్‌లో మైనార్టీలతో ముచ్చటిస్తూ టీ తాగుతున్న ఎమ్మెల్సీ కవిత, ఇందల్వాయి జడ్పీటీసీ సుమనా రవిరెడ్డి

**స్థానికులకే ఉద్యోగాలు**

తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఏడేండ్లు కొట్లాడి ప్రభుత్వ ఉద్యోగాల్లో 95 శాతం స్థానికులకే ఇవ్వాలని రాష్ట్రపతి ద్వారా మార్పులు చేయించి కేంద్రం నుంచి జీవో తెచ్చారని వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడుతున్నామని, దీంతో గూగుల్ లాంటి పెద్దపెద్ద కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ రకరకాల అబద్ధాలు చెబుతున్నదని, అలా చెప్పే ఆ పార్టీ కర్ణాటకలో అధికారంలోకి వచ్చిందన్నారు. రాగానే మూడు నెలల్లోనే సీఎం సీటు కోసం వాళ్లలో వాళ్లే పంచాయితీ పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు చెప్పిన పనులు చేయలేదన్నారు. కరెంట్ 9 గంటలు ఇస్తామని, మూడు గంటలు కూడా ఇవ్వడంలేదన్నారు. అదే తెలంగాణలో అయితే 24 గంటలు కరెంట్, ఇంటికాడికే నీళ్లు ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మన రాష్ట్రంలో కరెంట్ రాకుండా పోతుందని, మరోసారి భయంకరమైన పరిస్థితి వస్తుందన్నారు. గ్రామాలకు వచ్చి వట్టి మాటలు చెప్పే వారిని నమ్ముతారా.. పదేండ్ల నుంచి చెప్పింది చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నమ్ముతారా ఆలోచన చేయాలని సూచించారు. పదేండ్ల క్రితం పాలనలో ఎట్లు న్నం. ఇప్పుడు ఎట్లున్నం. అని గుర్తు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పింఛన్లు వస్తాయన్నారు. మూడు వేలతో ప్రారంభమైన యేడాదికి రూ. 500ల చొప్పున రూ. 5వేలకు పెంచుతామన్నారు. మొదట తెల్లరేషన్ కార్డులు ఇస్తామని, ఏ ఇంటికి పింఛన్లు రావడం లేదో చూసి ఆ ఇంటి ఆడబిడ్డకు రూ.3వేల పింఛన్ ఇస్తామని చెప్పారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ప్లాట్ ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.3లక్షలు ఇస్తామని, ఈ పథకం నిరంతరంగా ఉంటుందన్నారు. కేసీఆర్ చెప్పినట్లు ఈ పదేండ్లలో పుష్కలంగా నీళ్లు, 24 గంటల కరెంట్‌తో పంటల సాగు పెరిగిందన్నారు. భూమి దొరకడం లేదని తెలిపారు. స్థలం లేని వారికి కూడా ప్రభుత్వమే భూమి కొని ఇండ్లు నిర్మించి ఇస్తుందని చెప్పారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు.

# ఇందూరును చూసి ఎన్ఆర్ఐలు ఆశ్చర్యపోయారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

- పదేండ్లలో నగరం ఎంతో అభివృద్ధి చెందింది
- మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సే
- బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల

ఖలీల్‌వాడి, నవంబర్ 24 : అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ఇందూరు నగరాన్ని చూసి ఎన్ఆర్ఐలు ఆశ్చర్యపోయారని ఎన్ఆర్ఐ గ్లోబల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ముందున్న ప్రవాస భారతీయులు సీఎం కేసీఆర్ నిర్వహించే ప్రతి కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతూ బీఆర్ఎస్ గెలుపు కోసం అర్బన్ ఎన్ఆర్ఐలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడానికి 52 దేశాల ప్రతినిధులందరూ దిశానిర్దేశం చేసుకుని పని చేస్తున్నామని చెప్పారు. నగరంలో 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్ఆర్ఐలు ప్రచారం చేశారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం నిజామాబాద్ వచ్చిన ఎన్ఆర్ఐలు ఇక్కడ జరిగిన అభివృద్ధి చూసి ఆశ్చర్యపోయారని చెప్పారు. పదేండ్లలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠధామాలు, ఐటీ హబ్, సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మించారన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడం కోసం అనేక కంపెనీలు నగరానికి వచ్చాయని చెప్పారు. అభివృద్ధిని ఆదరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

**బిగాలను భారీ మెజార్టీతో గెలిపించాలి**

ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మచలం మాట్లాడుతూ.. మనం పుట్టిన నేల, ఇక్కడి మనుషులు బాగుండాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.బీఆర్ఎస్ కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేస్తే 50 సంవత్సరాలు వెనక్కి వెళ్తామన్నారు. ఎమ్మెల్యే బిగాల తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు కామారెడ్డిలో ఓట్లు అడిగే మొఖం లేక కేసీఆర్‌ను చూసి ఓడిపోతామనే భయంతో నిజామాబాద్‌లో వచ్చి పోటీ చేస్తున్నాడని విమర్శించారు. బీజేపీ వాళ్లు చేసిందేమీలేదని, మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బిగాల గణేశ్ గుప్తా, మహేశ్‌గుప్తా, కవిత, కేటీఆర్ కలిసి ఐటీ హబ్ నిర్మించి యువతకు ఉపాధి కల్పించారని తెలిపారు. నగర ప్రజలు చైతన్యవంతులని, అభివృద్ధి, సంక్షేమానికి మద్దతుగా నిలుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బిగాల గణేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టినం

- కుటుంబాలకు ఎన్నో రోజులు దూరంగా ఉన్నాం..
- ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిన్నాం..
- బీజేపీ, కాంగ్రెస్ నాయకులెవరూ పట్టించుకోలే..
- కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం
- తెలంగాణ ఉద్యమకారుడు సత్యప్రకాశ్



నమస్తే ఇంటర్వ్యూ

ఖలీల్‌వాడి, నవంబర్ 24: 'ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్నాం. ప్రతి రోజూ ధర్నాలు, ఆందోళన చేసేవాళ్లం. పోలీసులు వచ్చి మాపై లాఠీ దెబ్బలు కొట్టి, ఈడ్చుకుపోతుంటే బీజేపీ, కాంగ్రెస్ నాయకులెవరూ ముందుకురాలేదు. అలా చూస్తుండిపోయారు. మా పోరాటం తెలంగాణ కోసమని అన్ని బాధలు భరించాం..ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమంలో పాల్గొన్నాం. ప్రత్యేక రాష్ట్రం రావడంతో సీఎం కేసీఆర్ తెలంగాణను పదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశారు. అభివృద్ధి అందరి కండ్ల ముందు కనిపిస్తున్నది. ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది.' అని తెలంగాణ ఉద్యమకారుడు సత్యప్రకాశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.. ఆయన మాటల్లోనే..

**కుటుంబానికి ఎన్నో రోజులు దూరంగా ఉన్నాం**

తెలంగాణ ఉద్యమ సమయంలో కుటుంబానికి ఎన్నోరోజులు దూరంగా ఉన్నాం. ఎక్కడ ఏం జరిగినా పోలీసులు మమ్మల్ని ఉదయం స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి వదిలేసేవారు. నాకు ఇద్దరు చిన్న పిల్లలు. భార్య, ఇద్దరు పిల్లల్ని

వదిలి ఉద్యమంలో పాల్గొన్నా. ఉద్యమ సమయంలో నాపై 180 కేసులు పెట్టారు. జైలుకు పంపించారు. ఒక వేళ తెలంగాణ రాకుంటే నా జీవితం జైలుపాలయ్యేది. ఎందుకంటే తెలంగాణ ఉద్యమం చేసినన్నీ రోజులు కేసులు పెడుతూ, కొడుతూ చిత్రహింసలకు గురిచేశారు. మొట్టమొదటి సారిగా జైలుకు వెళ్లింది నేనే. కొంతమంది ఎందుకు నీ జీవితం నాశనం చేసుకుంటావ్ అని నన్ను అనేవారు. కానీ నేను ఏమైనా సరే తెలంగాణ వచ్చే వరకు కొట్లాడుతా అని ప్రతి ధర్నాలో పాల్గొనేవాడిని.

**రాష్ట్రం వచ్చింది అభివృద్ధి చేసుకోవడానికి.. దోచుకోవడానికి కాదు..**

తెలంగాణ సాధించుకున్నది అభివృద్ధి చేసుకోవడానికి. ఇతర పార్టీలు దోచుకోవడానికి కాదు. గతంలో తెలంగాణ ఎలా ఉండేది. ఇప్పుడు ఎలా ఉందో అందరూ తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మళ్లీ తెలంగాణ ప్రజలు 40 ఏండ్లు వెనక్కి పోవాల్సి వస్తుంది. తెలంగాణపై పక్క రాష్ట్రం నాయకుడి పెత్తనం ఏంటి. ఇక్కడ ఏం చేయాలని వస్తున్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక మనమీద పడుతున్నారు. కానీ ఇక్కడి ప్రజలు ఊరుకోరు.. డొక్కతీసి డోలు కడుతారు. కాంగ్రెస్ నాయకుల బూటకపు హామీలను ప్రజలు, రైతులు నమ్మే స్థితిలో లేరు. ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడ ఉన్నారు. నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నప్పుడు ఎక్కడ పడుకున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఆంధ్రకు పోతుంటే ఏం చేశారు. ఉద్యమంలో 180 కేసులు పెట్టారు. లాఠీ దెబ్బలు తగిలి తీవ్ర గాయాల పాలయ్యాం. జైలుకు కూడా పంపించారు. ప్రస్తుతం పచ్చగా ఉన్న తెలంగాణను నాశనం చేయడానికి మళ్లీ వస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలు**

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీజేపీ, కాంగ్రెస్‌పార్టీ ఎత్తుగడలు వేస్తూ ఇక్కడ తిష్ట వేయడానికి వస్తున్నాయి.ఆ పార్టీలకు అంత సీన్‌లేదు ఇక్కడ. పనికి మాలిన పార్టీలన్నీ తెలంగాణ మీద పడ్డాయి. అభివృద్ధిలో భాగంగా నిజామాబాద్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దొరికాయి. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా విదేశాల్లో వ్యాపారాలను వదులుకొని ఇందూరుకు వచ్చి సేవలు అందిస్తున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.పదేండ్లలో ఇందూరు నగరం ఎంతో అభివృద్ధి చెందింది. బొడ్డెమ్మ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తారని ఎవరూ ఊహించలేదు.కాంగ్రెస్ నాయకులు చేతకాక అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మధ్యలో వదిలేశారు. అర్బన్ ఎమ్మెల్యే బిగాల.. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి యూజీడీ పనులను పూర్తిచేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించారు.

**పదేండ్లలో ఇందూరు ఎంతో మారింది..**

ఇందూరు పదేండ్ల క్రితం ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. కేసీఆర్ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసింది. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. ఇంత అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయం.